సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 22 । జూన్ । 2025



ఎంటీఎస్ టీచర్ల ఆక్రందన
దూరప్రాంతాల్లో పనిచేస్తున్న 1998 డీఎస్సీ మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులు తమను తమ గ్రామ సమీప ప్రాంతాలకు బదిలీ చేయాలని కోరుతున్నారు. 8లో ▸



వేతన బకాయిల కోసం ధర్నా
తణుకు జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు తమ వేతన బకాయిలు, పీఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలంటూ ధర్నా చేపట్టారు. 8లో ▸



శాయ్‌లో లైంగిక వేధింపులు
ఏలూరులోని శాయ్‌లో క్రీడాకారిణులపై లైంగిక వేధింపుల ఆరోపణలు సంచలనంగా మారాయి. దీనిపై అధికారులు విచారణ చేపట్టి నిజమేనని తేల్చారు. 8లో ▸

న్యూస్‌రీల్

మట్టి తొలగింపు



కలసిపూడిలో రోడ్డుపై మట్టి తొలగించిన దృశ్యం

సాక్షి స్పందన

ఉండి: సాక్షి వరుస కథనాలతో అధికారులు కదిలారు. ఇటీవల ఉండి పంటకాలువలో పూడికతీతల పేరుతో కాలువ నుంచి తొలగించిన మట్టిని కాలువగట్లు, జాతీయ రహదారిపై వేసి నిర్లక్ష్యంగా వదిలేశారు. దీని వల్ల వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో మట్టి రహదారిపైకి వచ్చి వాహనదారుల పాలిట ప్రమాదకరంగా మారింది. సాక్షి కథనాలతో అధికారులు మేల్కొని జాతీయ రహదారిపై, కలిసిపూడి, చెరుకువాడ కాలువ గట్టుపై వేసిన మట్టిని తొలగించారు.

కొనసాగుతున్న విద్యా వ్యాపారం



భీమవరం సెయింట్ ఆన్స్ స్కూల్‌లో అమ్మకానికి సిద్ధం చేసిన విద్యా సామగ్రి

భీమవరం: ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు, విద్యాసామగ్రి విక్రయాలను ఎట్టి పరిస్థితిలో సహించేది లేదని కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించినా యాజమాన్యాలు లెక్కచేయడం లేదు. ఈనెల 19న భీమవరంలో ప్రైవేటు స్కూల్ యాజమాన్యాల సమావేశం ఏర్పాటుచేసిన కలెక్టర్ విద్యావ్యాపారాన్ని ప్రోత్సహించే స్కూళ్లపై చర్యలు తీసుకోకుంటే విద్యాశాఖాధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ పట్టణంలోని సెయింట్ ఆన్స్ స్కూల్లో శనివారం విద్యార్థులకు పుస్తకాలు, విద్యాసామగ్రి విక్రయిస్తుండగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బి.గణేష్ నాయకత్వంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకున్నారు. స్కూల్ యాజమాన్యం స్కూల్లో విక్రయాలు చేయకుండా పక్కనే ఉన్న మరో భవనంలో సామగ్రి విక్రయించడం విశేషం. దీనిపై విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గణేష్ ఆరోపించారు. సంఘటనా ప్రాంతానికి ఎంఈవో వచ్చి స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి వెళ్లిపోయారుతప్ప పుస్తకాల విక్రయాన్ని అడ్డుకోలేదని, దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తణుకులో నిరాహార దీక్ష చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

తణుకు అర్బన్: ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేయాలని ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ (జేఏసీ) తణుకు శాఖ అధ్యక్షుడు ఉండ్రాజవరపు శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తణుకు మునిసిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన శిబిరంలో శనివారం నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమను ఆప్కాస్ నుంచి తొలగించవద్దని, ఒకవేళ తొలగించాల్సి వస్తే తప్పకుండా పర్మినెంట్ చేయా లని కోరారు. ప్రభుత్వ సంక్షేమాలు అందరికీ అమలుచేయాలని, కార్మికుల రిటైర్‌మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని, అత్యవసర విభాగాలైన నీటి సరఫరా, వీధిదీపాలు, పైప్‌లైన్ లీకేజీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇనస్పెక్టర్స్ ఇంజినీరింగ్ టెక్నికల్ అండ్ నాన్ టెక్నికల్ మాదిరిగా రూ. 29,200, 24,500 వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు.

నేడు ఎంటీఎస్ టీచర్లకు బదిలీల కౌన్సెలింగ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో ఉన్న అందరు మినిమం టైమ్ స్కేల్ టీచర్లకు ఈ నెల 22న బదిలీలు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీలకు సంబంధించిన ప్రక్రియ ఏలూరులోని జీఎంసీ బాలయోగి సైన్స్ పార్క్‌లో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ బదిలీలకు ఎంటీఎస్ టీచర్లు హాజరయ్యేలా సంబంధిత మండల విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

- వర్షాకాలంలో సొమ్ము చేసుకునే పనిలో కూటమి నేతలు
- నిబంధనలకు విరుద్ధంగా ఇసుక నిల్వలు
- **సీఆర్‌జెడ్‌లో అనధికార తవ్వకాలు**
- **ఆచంట, పెనుగొండ, యలమంచిలి మండలాల్లో అక్రమ స్టాకులు**



కరుగోరుమిల్లి సమీపంలో ఇసుక నిల్వలు

కాసుల గుట్టలు

సాక్షి, భీమవరం: వరదల సమయంలో ఇసుక వ్యాపారంపై కూటమి నేతలు కన్నేశారు. భారీగా ఇసుక లాటులు పెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. కోస్టల్ రెగ్యులేషన్ జోన్(సీఆర్‌జెడ్) నిబంధనలకు తూట్లు పొడుస్తూ ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాల్లో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఎక్కడ చూసినా ఇసుక నిల్వలు కనిపిస్తున్నాయి. జిల్లాలోని సిద్ధాంతం, కరుగోరుమిల్లి, కోడేరు, నడిపూడి ఓపెన్ రీచ్‌లు, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, యలమంచిలిలంక, చించినాడ, మాధవాయిపాలెంలోని డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా గతంలో ఇసుక తవ్వకాలు జరిగేవి. సముద్రపు పోటుతో ఉప్పునీటి సాంద్రత వలన ఈ ర్యాంపుల్లోని ఇసుక నిర్మాణాలకు పనికిరాదని కోస్టల్ రెగ్యులేషన్ జోన్ తవ్వకాలు నిలిపివేసింది. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లోని ర్యాంపుల నుంచి ఇసుక తెస్తున్నారు.



కరుగోరుమిల్లి సమీపంలో అనధికార తవ్వకాలు

అధికారికంగా ఐదు లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందున వర్షాకాలంలో ఇసుక కొరత రాకుండా 5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేయాలని ఏప్రిల్ నెలలో జిల్లా శాండ్ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు ప్రతి నియోజకవర్గంలో 70 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను డంప్ చేయాలని సూచించింది. జిల్లా అవసరాల కోసం ప్రత్యేకంగా కేటాయించిన తూర్పుగోదావరి జిల్లా పెండ్యాల ఓపెన్ రీచ్ నుంచి ఇసుక తరలింపునకు నిర్ణయించారు. ఈ మేరకు భీమవరం, ఆచంట, నరసాపురం, పాలకొల్లు, తణుకు, ఉండి, తాడేపల్లిగూడెంలో గతంలోనే స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతల్ని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారు. ఇదిలా ఉండగా రవాణ చార్జీలు రూపంలో భారీ మొత్తాన్ని మిగుల్చుకునేందుకు అధికార స్టాక్ పాయింట్లకు అనధికార ర్యాంపుల నుంచి ఇసుక తరలిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. గోదావరి చేరువలోని పాయింట్లకు సమీపంలోని సిద్ధాంతం, కోడేరు, కరుగోరుమిల్లి నుంచి ఇసుక తరలిస్తున్నట్టు తెలుస్తోంది.

యథేచ్ఛగా తవ్వకాలు

జులై నుంచి గోదావరికి వరదలు మొదలై దాదాపు నాలుగు నెలల పాటు ర్యాంపులు మూతపడతాయి. ఇసుక లభ్యత తగ్గి డిమాండ్ పెరిగిపోతుంది. ఇదే అదునుగా ప్రజల అవసరాన్ని సొమ్ము చేసుకునే ఆలోచనలో అధికార పక్షం నేతలు ఉన్నారు. ప్రభుత్వ పెద్దల అండదండలతో స్థానిక యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడకపోవడం, మైనింగ్ శాఖ జిల్లా వైపు కన్నెత్తి చూడకపోవడం ఇసుకాసురుల ఇష్టారాజ్యంగా మారింది. సిద్ధాంతం నుంచి నరసాపురం వరకు ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. ఆయా ర్యాంపుల నుంచి రోజుకు 300 లారీలకు పైగా ఇసుక తవ్వకాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. లోడింగ్ రూపంలో బయట అమ్మకాలు చేయడంతో పాటు వర్షాకాలం నిల్వలకు తరలిస్తున్నారు. నిర్మాణ అవసరాల పేరిట చోటా మోటా నాయకులు సైతం వీలైనంత మొత్తంలో ఇసుక నిల్వలు చేస్తున్నారు.

ఎక్కడ చూసినా గుట్టలే



సిద్ధాంతం సమీపంలో ఇసుక నిల్వలు

జిల్లాలోని ఆచంట, పెనుగొండ, పోడూరు, యలమంచిలి తదితర మండలాల్లో భారీ ఎత్తున ఇసుక నిల్వ చేస్తున్నారు. వర్షాకాలం అవసరాల నిమిత్తం 5 లక్షల మెట్రిక్ టన్నులు స్టాకు పెట్టాలని అధికారికంగా నిర్ణయించగా జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం రెట్టింపు స్థాయిలో నిల్వలు ఉన్నట్టు సమాచారం. వీటిలో ఏ స్టాకు పాయింట్లకు అనుమతులు ఉన్నాయి?, వేటికి లేవో? తెలీని పరిస్థితి ఉంది. అనధికారికంగా తవ్వకాలు చేస్తూ నిర్మాణాలకు పనికిరాని ఇసుక నిల్వ చేస్తున్నా సంబంధిత యంత్రాంగం పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఈ ఇసుకతో నిర్మాణాలు చేయడం వల్ల మన్నిక కాలం తగ్గిపోతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ర్యాంపులు లేవన్న సాకుతో మైనింగ్ శాఖ జిల్లా వైపు కన్నెత్తి చూడటం లేదంటున్నారు. ఇసుక నిల్వలపై వివరాల కోసం మైన్స్ ఇన్‌చార్జి ఏడీ రవికాంత్‌ను ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా ఫోన్ కలవలేదు.

పదవికి వన్నె తెచ్చేలా మాట్లాడాలి

కేంద్ర మంత్రి వర్మకు కొట్టు హితవు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : పదవికి వన్నె తెచ్చేలా మాట్లాడాలని కేంద్రమంత్రి వర్మకు మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ హితవు పలికారు. శనివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ తన తండ్రి మరణించిన సమయంలో తనకు ఆరు సార్లు ఫోను చేసి మాట్లాడిన వర్మకు తాను ఎవరో తెలియదని ఇటీవల నిర్వహించిన సమావేశంలో మాట్లాడటం సబబుగా లేదన్నారు. కొట్టు సత్యనారాయణ ఎవరో తెలియనప్పుడు తాను విశాఖపట్నంలో ఉండగా ఫోన్ చేసి ఎలా మట్లాడారని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రిగా, దేవదాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపనలు చేసిన అభివృద్ధి పనులకు ఇప్పుడున్న ఎమ్మెల్యే కొబ్బరికాయలు కొట్టి తాను తీసుకొచ్చినట్లుగా చెబుతున్నారని విమర్శించారు. కౌన్సిలర్‌గా గెలిచి.. కేంద్ర మంత్రి పదవికి ఎదిగినా గత స్థితిని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. తన సహకారంతో కౌన్సిలర్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా పదవులు చేసిన ప్రస్తుత గూడెం ఎమ్మెల్యే గతాన్ని గుర్తుకు తెచ్చుకోవాలని మంత్రి కొట్టు అన్నారు. ఎమ్మెల్యేగా పదవి చేపట్టిన ఏడాది కాలానికే నియోజకర్గానికి పేకాట క్లబ్‌లు, కోడి పందేలు, దాబాల స్థావరంగా మార్చేశారని, లేఅవుట్లు యజమానుల నుంచి రూ.కోట్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఎయిర్‌పోర్టును వీరి కాలంలో పూర్తిచేయగలరా లేక మసిపూసి మారేడు కాయ చేస్తారా? అని ఎద్దేవా చేశారు. అన్యాయం జరిగితే ప్రశ్నిస్తానన్న పవన్‌కళ్యాణ్ రాష్ట్రంలో సూపర్‌సిక్స్ హామీల అమలుపై నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ముప్పిడి సంపత్‌కుమార్, జిడ్డు హరిబాబు, బొద్దాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ట్రైనింగ్ వాయిదా వేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 23 నుంచి ఒకవైపు సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఆరు రోజులపాటు ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్‌ను ఆగిరిపల్లిలో నిర్వహించడానికి సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉత్తర్వులు ఇచ్చారని, వాటిని వాయిదా వేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్ళూరి రామారావు, బీ.రెడ్డిదొర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలలు ప్రారంభమై ఉపాధ్యాయులు విద్యార్థులను చేర్చుకునే పనిలో ఉన్నారని, ఈ పరిస్థితులలో ట్రైనింగ్ పేరుతో ఉపాధ్యాయులను పాఠశాలలకు దూరం చేస్తే విద్యార్థుల నమోదు తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రైనింగ్‌ను కనీసం రెండు నెలలు వాయిదా వేయాలన్నారు.

డిప్లమో కోర్సుల దరఖాస్తుకు గడువు పెంపు

పెనుమంట్ర: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా నిర్వహించే వ్యవసాయ డిప్లమో కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈ నెల 30 వరకూ పొడిగించినట్లు మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ టి.శ్రీనివాస్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను జూన్ 30 వరకూ పొడిగించినట్లు తెలిపారు. ఏవైనా సందేహాలుంటే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మారుటేరు లేదా వ్యవసాయ పాలిటెక్నిక్, మారుటేరు కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చన్నారు.

మోసం బాబుకు వెన్నతో పెట్టిన విద్య

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి
- భీమవరం సమన్వయకర్త చినమిల్లికి ఆత్మీయ సత్కారం





సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు, వేదికలో పార్టీ నేతలు, మాట్లాడుతున్న పార్టీ భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకట రాయుడు

భీమవరం: అమలుకాని హామీలతో ప్రజలను మోసం చేసి అందలమెక్కడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అధికారం చేపట్టాక మర్చిపోవడం ఆయన నైజమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు దుమ్మెత్తిపోశారు. శనివారం భీమవరంలో భీమవరం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రజలకు చేసిన సంక్షేమ పథకాలు నేడు ఎక్కడా కన్పించడంలేదని దీంతో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలోనే ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. పథకాల పేర్లను మార్చి వాటిని నిర్వీర్యం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ప్రసాదరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని కక్ష కట్టి కేసులు పెడుతున్నారన్నారు. అధికారం ఉన్నా లేకున్నా వైఎస్సార్‌సీపీ ఎప్పుడు ప్రజల పక్షానే పోరాడుతుందని గుర్తు చేశారు. నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రజలంతా వైఎస్సార్‌సీపీ పక్షానే ఉన్నారని పార్టీ శ్రేణులు మరింత పటిష్టంగా ప్రభుత్వ అరాచకాలు, అన్యాయాలను ఎదుర్కోవాలన్నారు. పార్లమెంట్ సమన్వయకర్త గూడూరి ఉమాబాల మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని దీనికి చినమిల్లి వెంకటరాయుడును సమన్వయకర్తగా నియమించడమే నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి ఏకతాటిపై పోరాటాలు చేసి ప్రజలకు అండగా ఉండాలన్నారు. సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ అందరూ సమష్టిగా పని చేసి రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఉంగుటూరు, పాలకొల్లు, చింతలపూడి పార్టీ ఇన్‌చార్జులు పుప్పాల వాసుబాబు, గూడాల గోపి, విజయరాజు, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, పార్టీ అధికార ప్రతినిధి కామన నాగేశ్వరరావు, మేడిది జాన్సన్, ఏఎస్ రాజు, భీమవరం, వీరవాసరం, రూరల్ పార్టీ అధ్యక్షులు గాదిరాజు రామరాజు, చవాకులు సత్యనారాయణ, జల్లా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీల తొలగింపు



భీమవరంలో వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు తొలగించి వాహనంలో వేసిన దృశ్యం

భీమవరం: శనివారం చినమిల్లి వెంకటరాయుడుకు అభినందనలు తెలుపుతూ పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటుచేశారు. ఆ ఫ్లెక్సీలను తొలగించాలని టీడీపీ నేతలు మున్సిపల్ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. దీంతో శుక్రవారం రాత్రి ఫ్లెక్సీలను మునిసిపల్ సిబ్బంది తొలగించారు. పార్టీ నేతలు అడ్డుకుని ప్రశ్నించారు. యోగా డే సందర్భంగా తొలగించాలని కలెక్టర్ ఆదేశించారని సమాధానం ఇవ్వడంతో నేతలు మండిపడ్డారు. అడ్డుగా ఉంటే అన్ని పార్టీల ఫ్లెక్సీలు తొలగించాలని, కేవలం వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు తొలగించడం ఏంటని గట్టిగా నిలదీశారు.

సందడిగా యోగా దినోత్సవం



కలెక్టరేట్ ప్రాంగణం వద్ద యోగాసనాలు



యోగా చేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): అంతర్జాతీయ యోగా దినోత్సవం శనివారం జిల్లా కలెక్టరేట్ పేరెడ్ గ్రౌండ్స్‌లో సందడిగా సాగింది. దాదాపు 8 వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఇంతవరకూ నేర్చుకున్న యోగా అభ్యాసన నిలిపివేయకుండా రోజు సాధన చేసి సంపూర్ణ ఆరోగ్యం పొందాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేసినందుకు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు, జిల్లా అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేశారని కితాబిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 4,835 ప్రాంతాల్లో సుమారు 8 లక్షల మందితో విజయవంతంగా యోగా కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. రాజ్యసభ సభ్యుడు పాకా నారాయణ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన భారతదేశం కోసం ప్రధాని నరేంద్ర మోదీ యోగాకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గత నెల రోజులుగా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో నిర్వహించిన యోగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, ఆర్డీఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ప్రజలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తమ్మిలేరులో యువకుడి గల్లంతు

చింతలపూడి: చేపల వేటకు వెళ్లిన యువకుడు గల్లంతైన సంఘటన చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం సమీపంలోని తమ్మిలేరు జలాశయంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి నగర పంచాయతీ ఛార్లెస్‌నగర్‌కు చెందిన గద్దం శాంత కుమార్(29) స్నేహితులతో కలిసి నాగిరెడ్డి గూడెం సమీపంలోని తమ్మిలేరు ప్రాజెక్టుకు చేపల వేటకు వెళ్లాడు. చేపలు పట్టడానికి జలాశయం లోనికి దిగిన శాంతకుమార్ ప్రమాదవశాత్తూ జలాశయంలో మునిగిపోయాడు. మిగిలిన స్నేహితులు ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. అక్కడే ఉన్న మత్స్యకారులు, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించి గాలింపు చర్యలు చేపట్టారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది కూడా ప్రాజెక్టు వద్దకు చేరుకుని మృతదేహం కోసం గాలిస్తున్నారు. స్థానిక ఎస్సై కె.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రాజెక్టు వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

టీటీడీకి 12 టన్నుల కూరగాయల వితరణ



టీటీడీ వాహనం వద్ద పూజలు చేస్తున్న దాతలు

నూజివీడు: తిరుమల తిరుపతి దేవస్థానం అన్నదాన ప్రసాదం ట్రస్టుకు నూజివీడు నుంచి శనివారం 12 టన్నుల కూరగాయలను భక్తులు పంపారు. మండలంలోని దేవరగుంటకు చెందిన నక్కా సత్యనారాయణ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి భక్తులు కూరగాయలను సేకరించి టీటీడీ ప్రత్యేక వాహనంలో తిరుమలకు పంపించారు. అలాగే ద్వారకాతిరుమల ఆలయంలో అన్నదానం నిమిత్తం నాలుగు టన్నుల కూరగాయలను పంపారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

యలమంచిలి: మేడపాడు హైస్కూల్ విద్యార్థులు యోగాంధ్ర చిత్రలేఖనం పోటీల్లో జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీ సత్యనారాయణ తెలిపారు. శనివారం యనా విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల భీమవరంలో జరిగిన పోటీల్లో మేడపాడు హైస్కూల్ విద్యార్థులు డి.కోటేశ్వరి ప్రథమ, ఎ.శివార్షిణి ద్వితీయ స్థానం సాధించినట్లు ఆయన వివరించారు. వారిద్దరికీ కలెక్టర్ నాగరాణి, డీఈఓ బహుమతులు అందజేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు అడ్డాల శివరామకృష్ణంరాజును అభినందించారు.

ఎంటీఎస్ టీచర్ల ఆక్రందన

- సొంత ఊళ్లకు 200 కిలోమీటర్ల దూరంలో ఉద్యోగం
- ఈ సారి దగ్గర మండలాలకు బదిలీ చేయాలని వేడుకోలు



విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం 1998 డీఎస్సీ, 2008 డీఎస్సీ అర్హులకు ఉపాధ్యాయులుగా మినిమం టైం స్కేల్ ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించి ఆదుకుంది. జగన్ తీసుకున్న కీలక నిర్ణయంతో డీఎస్సీల్లో అర్హులైన మొత్తం 390 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చాయి. కలగా మిగిలిపోతుందనుకున్న ఉద్యోగం రావడంతో వారు వివిధ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో పని సర్దుబాటు ప్రక్రియలో ఎంటీఎస్ టీచర్లను బదిలీ చేశారు. ఈ బదిలీల్లో వీరిని సొంత మండలాల పరిధిలోనే చేయాల్సి ఉండగా సుమారు 140 నుంచి 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలకు మార్చారు. వీరిలో కొంతమందికి ఏడాది, మరికొంత మంది రెండేళ్లలో పదవీ విరమణ చేయనున్నారు. 2008 డీఎస్సీ అర్హుల్లో సైతం కొంతమంది మరో 5 ఏళ్ల నుంచి 10 ఏళ్లలోపులో పదవీ విరమణ చేయాల్సి ఉంది. పని సర్దుబాటు ప్రక్రియలో వీరిని చాలా దూరానికి బదిలీ చేయడంతో ఒక పక్క పిల్లల చదువులు, మరో పక్క వృద్ధులైన తల్లిదండ్రుల బాధ్యత నెరవేర్చలేక మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

2008 డీఎస్సీ అభ్యర్థులకు ప్రాధాన్యం

ఆయా బాధ్యతలు నెరవేర్చలేక మానసికంగా కుంగిపోతున్న వారికి అన్నిటికీ మించి దీర్ఘకాలిక అనారోగ్యాలు వెంటాడుతున్నాయని వాపోతున్నారు. దీంతో పాటు తమకు అలవాటులేని వాతావరణంలో పని చేయాల్సి రావడంతో అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టింది. వాస్తవానికి ఈ నెల 20న ఎంటీఎస్ టీచర్ల బదిలీ జరగాల్సి ఉండగా సాంకేతిక కారణాలతో బదిలీలు వాయిదా వేశారు. కౌన్సిలింగ్ ఆదివారం చేపట్టనున్నట్టు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ప్రకటించారు. ఈ బదిలీల్లో ముందుగా వృత్తిలో చేరిన 2008 డీఎస్సీ అర్హులను సీనియారిటీ జాబితాలో పైకి చేర్చి అనంతరం వృత్తిలో చేరిన 1998 డీఎస్సీ అర్హులను తరువాత వరుస క్రమంలో చేర్చారు. ఈ కారణంగా ఈ సారి బదిలీల్లో కూడా తమకు అన్యాయం జరుగుతుందని 1998 అర్హులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తమను కనికరించాలని వేడుకోలు

మరో ఏడాది, రెండేళ్లలో పదవీ విరమణ చేసే తమను మళ్లీ 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలకు బదిలీలు చేస్తే తమకు తీవ్ర అన్యాయం చేసినట్టేనని 1998 డీఎస్సీ అర్హులు వాపోతున్నారు. ఈ బదిలీల్లో సీనియారిటీ కంటే వయసు సీనియారిటీని ప్రాతిపదికగా తీసుకుని వయసు రీత్యా 60 ఏళ్లకు దగ్గరలో ఉన్న తమకు బదిలీల్లో సీనియారిటీ జాబితాలో ప్రాధాన్యత కల్పించి కోరుకున్న ప్రాంతాల్లో పని చేసేలా చూడాలంటున్నారు. 2008 డీఎస్సీ అభ్యర్థులు తమ కంటే చిన్న వారు కాబట్టి పదవీ విరమణ వయస్సుకు దగ్గరగా ఉన్న తమకు సీనియారిటీ జాబితాలో ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు.

మోకాలి లోతు నీటిలో వెళ్లాలి



మాది రాజమండ్రి ప్రస్తుతం కుక్కునూరు మండలంలో 4వ కేటగిరీ ప్రాంతమైన ఉప్పేర మద్దిగట్లలో పని చేస్తున్నాను. అక్కడికి వెళ్లడానికి 12 కిలోమీటర్లు వాహనాలు వెళ్లవు. పైగా రోజూ మోకాలి లోతు నీటిలో దిగి వెళ్లాలి. వాగు పొంగితే ప్రాణాలు పణంగా పెట్టి వాగు దాటాల్సివస్తోంది. ఈ సారి కౌన్సిలింగ్‌లో మా సొంత మండలానికి బదిలీ చేయాలి.

– కే.శ్రీలత ఎంటీఎస్ టీచర్

200 కిలోమీటర్లు ప్రయాణించాలి



మాది భీమవరం. కుక్కునూరు మండలం పెదరావిగూడెంలో రెండేళ్లుగా పని చేస్తున్నాను. మా ఊరి నుంచి పాఠశాలకు వెళ్లాలంటే 200 కిలోమీటర్లు ప్రయాణించాలి. నాకు ఆరోగ్యం సరిలేదు. అక్కడి వాతావరణం పడడంలేదు. చాలా అనారోగ్యానికి గురయ్యాను. ఈ సారి కౌన్సెలింగ్‌లో స్పౌజ్ సరౌండింగ్ ఏరియాకు బదిలీ చేయాలి.

– వై.మెర్సీ, ఎంటీఎస్ టీచర్

అత్తమామల బాధ్యత నాపైనే



నేను కుక్కునూరు మండలం వెంకటాపురం ఎస్సీ కాలనీలో సింగిల్ టీచర్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్నాను. మా స్వగ్రామం నుంచి అక్కడికి 200 కిలోమీటర్లు ప్రయాణించాలి. అనారోగ్యంతో ఉన్న అత్తమామల బాధ్యత నాపైనే ఉంది. పని భారం ఎక్కువ, జీతం తక్కువ. 4వ కేటగిరీ ఏరియాలో విధులు నిర్వహించడం భారంగా ఉంటోంది.

– ఎం.భాగ్యలక్ష్మి, ఎంటీఎస్ టీచర్

సహకరించని ఆరోగ్యం



మాది తాళ్ళపూడి మండలం. ప్రస్తుతం 140 కిలోమీటర్ల దూరంలోని ఎర్రబోరు పాఠశాలలో పని చేస్తున్నారు. నాకు 58 ఏళ్ల వయసు. మరో రెండేళ్లలో పదవీ విరమణ చేస్తాను. వయోభారంతో ఆరోగ్యం సహకరించడం లేదు. నేను పని చేస్తున్న ప్రాంతానికి బస్సు సౌకర్యం కూడా లేదు. కనీస వైద్య సదుపాయం కూడా లేని ప్రాంతం.

– బట్టు సత్తెమ్మ, ఎంటీఎస్ టీచర్

నడిరోడ్డుపై యువకుడి హత్య



ఘటనా స్థలంలో ఎర్రబాబు మృతదేహం

దెందులూరు: ఏలూరు వెళ్లే రహదారిపై వీరభద్రపురం వద్ద శనివారం యువకుడి దారుణహత్య కలకలం రేపింది. దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు పాములదిబ్బకు చెందిన ఎం.ఎర్రబాబు (30) ద్విచక్ర వాహనంపై గోపన్నపాలెం నుంచి ఏలూరు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కారులో వచ్చిన కొంతమంది వీరభద్రపురం వద్ద ఎర్రబాబును కిరాతకంగా నరికి చంపారు. సంఘటన స్థలాన్ని పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్ పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ యువకుడి హత్యపై కేసు నమోదు చేశామని, నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎర్రబాబును నిందితులు గోపన్నపాలెం నుంచి కారులో అనుసరిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. కారులో మొత్తం ఆరుగురు ఉన్నారని, హత్య తర్వాత వారు ఏలూరు వైపు వెళ్లిపోయారని తెలుస్తుంది. పాతకక్షల నేపథ్యంలో ఎర్రబాబు హత్య జరిగిందని, నిందితుడిపై పలు కేసులు ఉన్నట్లు సమాచారం.

రైలు నుంచి జారి పడి వృద్ధుడి మృతి

భీమడోలు: రైలులో ప్రయాణిస్తున్న ఓ వృద్ధుడు రైలు నుంచి జారిపడి మృతి చెందిన ఘటన భీమడోలు రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. విజయవాడకు చెందిన అల్లూరి సత్యనారాయణ(69) రైలులో ప్రయాణిస్తుండగా జారిపడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు ప్రాథమికంగా నిర్ధాయించారు. ఘటన స్థలంలోని మృతదేహాన్ని పోలీసులు పరిశీలించి పోస్టుమార్టమ్ నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్న వెంకన్న క్షేత్రంలో భక్తుల రద్దీ



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులతో క్షేత్ర పరిసరాలు భక్తులతో కళకళలాడాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. అలాగే ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివెట్టి మండపం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కల్యాణకట్ట, నిత్యాన్నదాన విభాగాలు భక్తులతో పోటెత్తాయి. అలాగే ఆలయ అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

ఏలూరు శాయ్‌లో లైంగిక వేధింపులు

- బెంగుళూరు శాయ్ బృందం దర్యాప్తులో వెల్లడి
- 10 మంది మహిళా క్రీడాకారిణుల ఫిర్యాదు



ఏలూరు శాయ్‌లో విచారణ చేస్తున్న బెంగుళూరు శాయ్ బృందం

ఏలూరు టౌన్: ఏలూరులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్)లో మహిళా క్రీడాకారిణులపై లైంగిక వేధింపుల ఆరోపణలు సంచలనంగా మారింది. తమను తీర్చిదిద్దాల్సిన గురువులే కీచకులుగా మారితే... తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలంటూ వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేధింపులు భరించలేక స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు మహిళా క్రీడాకారిణులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు లైంగిక వేధింపులు నిజమేనని నిర్ధారించారు.

అల్లూరి సీతారామరాజు స్టేడియం పక్కనే ఏర్పాటు చేసిన శాయ్ కేంద్రంలో మహిళా క్రీడాకారిణులపై లైంగిక వేధింపులు ఎక్కువ అవడంతో వారంతా కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఏకంగా 10 మంది మహిళా క్రీడాకారిణులు శాయ్ నిర్వాహకులు, వెయింట్ లిఫ్టింగ్ కోచ్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. శాయ్ ఇన్‌చార్జ్‌తో పాటు వెయిట్ లిఫ్టింగ్ జూనియర్ కోచ్ వారి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. శాయ్‌లో అథ్లెటిక్స్‌లో బాలురు, బాలికలు తర్ఫీదు పొందుతూ ఉండగా, వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో బాలికలు అధికంగా ఉన్నారు. బాలికలకు శాయ్ హాస్టల్‌లోనే వసతి సౌకర్యాలు కల్పిస్తారని సమాచారం. బాలురకు అల్లూరి సీతారామరాజు స్టేడియంలోని గదుల్లో వసతి కల్పిస్తారు. ఈ నేపథ్యంలో బాలికలను లైంగిక వేధింపులకు గురిచేయటంపై వారంతా శాయ్ కేంద్ర కార్యాలయాన్ని ఆశ్రయించారు.

బెంగుళూరు బృందం విచారణ

క్రీడాకారిణుల ఫిర్యాదుపై కేంద్రం శాయ్‌లోని ఇద్దరు సభ్యుల బృందం గత కొద్దిరోజులుగా రహస్య విచారణ చేపట్టి ఆరోపణలు వాస్తవమేనని నిర్ధారించినట్లు తెలుస్తోంది. దీంతో విచారణ అధికారులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించి దానిపై ప్రాథమిక దర్యాప్తు చేపడుతున్నట్లు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. శాయ్ ఇన్‌చార్జ్, వెయిట్ లిఫ్టింగ్ జూనియర్ కోచ్‌పై కేసు నమోదు విషయంలో రాజకీయ ఒత్తిడులు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

సహజీవనం చేస్తున్న భార్య, ప్రియుడిపై భర్త దాడి

నరసాపురం రూరల్: తన కుమారుడిని కొడుతున్నారంటూ భార్య, ఆమె ప్రియుడిపై భర్త దాడి చేసిన ఘటన మొగల్తూరు మండలంలో నక్కావారిపాలెంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నక్కావారిపాలెంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవిస్తున్న ఇంజేటి అభిషేక్‌కు రేవతితో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే వీరు విడాకుల కోసం ఏడాది క్రితం కోర్టును ఆశ్రయించారు. పిల్లల సంరక్షణ విషయంలో పెద్దల సమక్షంలో చర్చలు జరుగుతున్నాయి. అయితే రేవతి ఇదే గ్రామానికి చెందిన నర్సింహస్వామితో అక్రమ సంబంధం పెట్టుకుంది. నర్సింహస్వామి కూడా భార్యకు విడాకుల కోసం నోటీసులు ఇచ్చాడు. ఈ నేపథ్యంలో రేవతి, నర్సింహస్వామితో సహజీవనం చేస్తుంది. అయితే తన కుమారుడిని నర్సింహస్వామి కొడుతున్నా రేవతి అడ్డు చెప్పడం లేదంటూ అభిషేక్ కత్తితో శనివారం ఇద్దరిపై కత్తి దాడిచేశారు. గాయాలపాలైన వారిద్దరినీ 108 వాహనంలో నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ఈ మేరకు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు మొగల్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా



సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకు వినతిపత్రం అందిస్తున్న భీమారావు, కార్మికులు



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న శానిటరీ వర్కర్స్

తణుకు అర్బన్: స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల నాలుగు నెలల వేతన బకాయిలు, 36 నెలల పీఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏపీ మెడికల్ కాంటాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్ చేశారు.

శనివారం యూనియన్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఆవరణలో ధర్నా నిర్వహించి డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణకు అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ హాస్పిటల్ పారిశుద్ధ్య కార్మికులకు ఇస్తున్న వేతనాలే తక్కువని వాటిని కూడా నెలా నెలా సక్రమంగా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు సక్రమంగా రాకపోవడంతో కార్మికులు పస్తులతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. అలాగే తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి 150 పడకల స్థాయికి అనుగుణంగా కనీసం 60 మందికి తగ్గకుండా పారిశుద్ధ్య కార్మికులను నియమించి కార్మికుల పనిభారాన్ని తప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్నాని పుష్పలత, డి.ప్రసన్న కుమారి, మెండి శ్రీను, పి.లక్ష్మి, పి.రేణుక, ఎం.బేబి, ఇ.హైమావతి తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా హాస్పిటల్ శానిటరీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏడో రోజు ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడు జంపన వెంకటరమణ రాజు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు మాట్లాడుతూ ఏరియా హాస్పిటల్ సానిటరీ వర్కర్స్‌కి గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని మండిపడ్డారు. పెండింగ్ వేతనాలతో చెల్లించడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వేముల రాజు, సంజీవ్, మేరీ, చంద్రకళ, దయామని, జె.దుర్గారావు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో విజిలెన్స్ తనిఖీలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న విజయకృష్ణ

ద్వారకాతిరుమల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ తనిఖీ చేశారు. గురుకులంలో ఉంటున్న పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినుల సంఖ్య తదితర వివరాలను ప్రిన్సిపాల్, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథక అమలు తీరును స్వయంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజనం అమలులో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తన దృష్టికి తేవాలని విద్యార్థినులకు సూచించారు. అన్ని వివరాలతో కూడిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తానని ఆయన తెలిపారు.

అంజన్నకు అభిషేకం

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అభిషేక సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంపై స్వామి వారి ఉత్సవమూర్తికి అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం వరకు పలు సేవలు, విరాళాల రూపంలో రూ.1,93,724 ఆదాయం ఆలయానికి సమకూరినట్లు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు.

క్లుప్తంగా

వరాల వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ఈడూరులో విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర గ్రామాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి ఊంజల్ సేవ జరిపారు. హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వర్షపు నీటితో నేల కోత నివారణ



ఉద్యానవర్సిటీలో మొక్కలు నాటుతున్న వీసీ కె.గోపాల్

తాడేపల్లిగూడెం: వర్షపు నీటిని సంరక్షించుకోవడం వల్ల నేల కోతను నివారించవచ్చని ఉద్యాన వర్సిటీ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ అన్నారు. శనివారం వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. నీరు మీరు అనే కార్యక్రమం గురించి వివరిస్తూ భూగర్భ జలాల స్థాయిని పెంచడం, నీటి సంరక్షణ ప్రాముఖ్యతపై అందరిలో అవగాహన కల్పించడం, నీటి వనరులను సమర్థవంతంగా ఉపయోగించడం అనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ అఫైర్సు సూర్యకుమారి, రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. యోగాడేను పురస్కరించుకొని యోగాసనాలు వేశారు.

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం – త్యాజంపూడి వంతెన నిర్మాణం వల్ల పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని వీరంపాలెం గ్రామంలో ఎర్ర కాలువపై పీఎంజీఎస్‌వై నిధులు రూ.8.88కోట్లతో నిర్మించనున్న వీరంపాలెం – త్యాజంపూడి వంతెనకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎమ్పీటీసీ జంపెల్లి సత్యవతి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్, మాజీ సర్పంచ్ కేతిరెడ్డి రాంబాబు, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ప్రాజెక్టు ఏఈ ఎం.ఆలీస్టిన్ పాల్గొన్నారు.

కొలనువాడకు గౌరవ డాక్టరేట్



న్యూఢిల్లీలో గౌరవ డాక్టరేట్ అందుకున్న కొలనువాడ పెదకృష్ణంరాజు

పెంటపాడు: మండలంలోని అలంపురం గ్రామానికి చెందిన ప్రముఖ రైస్‌మిల్లర్, వెంకటరమణ చారిటీ వ్యవస్థాపకుడు కొలనువాడ పెద కృష్ణంరాజును గౌరవ డాక్టరేట్ వరించింది. ఈ సందర్భంగా ఆయన తన ట్రస్టు ద్వారా గత కొన్నేళ్లుగా ప్రధానంగా ఉచిత వైద్యసేవలకు సంబంధించి చేసిన సేవలకు ఆయన ఈ అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. కాగా శనివారం న్యూఢిల్లీకి చెందిన సోక్రటీస్ సోషల్ రిసెర్చ్ యూనివర్సిటీ ట్రస్టు ఆయనకు ఆ అవార్డు ప్రధానం చేసింది.

ఆర్టీసీ బస్సుల్లేక ప్రయాణికుల ఇబ్బందులు

- రెండురోజుల పాటు లేని బస్సులు
- బస్సుల కోసం వేచిచూసిన ప్రయాణికులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైనం

తణుకు అర్బన్ : విశాఖపట్నంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ఆర్టీసీ ప్రయాణం చేయాలనే ఉద్దేశ్యంతో తణుకు డిపోలోకి వచ్చిన ప్రయాణికులకు బస్సులు లేవనే విషయం ఆలస్యంగా తెలియడంతో ప్రయాణికులు ఉసూరుమంటూ వెనుదిరగాల్సి వచ్చింది. ఏకంగా శుక్రవారం, శనివారం రెండురోజుల పాటు బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఎక్కి వెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం లేకుండా బస్టాండ్‌కు వచ్చిన ప్రయాణికులు గంటల తరబడి వేచిచూసిన అనంతరం బస్సులు లేవని చెప్పడం కూడా ప్రయాణికులకు చిర్రెత్తుకొచ్చింది. దీంతో ఆర్టీసీ ఉద్యోగులపై సైతం ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేసిన పరిస్థితులు ఏర్పడ్డాయని చెబుతున్నారు.



తణుకు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల్లేని దృశ్యం

తణుకు డిపో నుంచి 52 బస్సులు..

తణుకు ఆర్టీసీ డిపోనుంచి 52బస్సులు ఈనెల 20వ తేదీన విశాఖపట్నానికి బయలుదేరి వెళ్లడంతో తణుకు డిపో నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు బస్సులకోసం వేచిచూడాల్సి వచ్చింది. చేసేది లేక ప్రమాదకరమని తెలిసినా ప్రైవేటు వాహనాలు ఎక్కి వెళ్లాల్సి వచ్చిందంటూ వాపోయారు. తణుకు డిపోలో ఉన్న 75 బస్సుల్లో ఏకంగా 52 బస్సులు రెండురోజుల పాటు అందుబాటులో లేకపోవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. శనివారం రాత్రి బస్సులు విశాఖపట్నంనుంచి తణుకు డిపోకి చేరుకుంటాయని ఆదివారం యథావిధిగా సర్వీసులు కొనసాగుతాయని డిపో అధికారులు చెబుతున్నారు.

భీమవరం వెళ్లేందుకు రెండు గంటలు వేచి ఉన్నా

తణుకు నుంచి భీమవరం వెళ్లేందుకు తణుకు డిపో నుంచి వచ్చే బస్సుల కోసం శనివారం రెండు గంటలపాటు వేచిచూడాల్సి వచ్చింది. చివరకు బస్సులు లేవనే విషయం తెలియడంతో భీమవరానికి ఆటో ప్రయాణం చేయాల్సి వచ్చింది. సమావేశాలకు వెళ్లాల్సి వచ్చిన సమయంలో ప్రైవేటు వాహనాలను ఉపయోగించుకోవాలి కానీ పేదవర్గాలు ఉపయోగించే ఆర్టీసీ బస్సులు పంపించడం ఎంతవరకు సబబు.

– పి.రాజేష్, తణుకు

కుక్కల బారి నుంచి కాపాడాలి

తాడేపల్లిగూడెం రూరల్: కుక్కల దాడి నుంచి ప్రజల్ని, పశువులను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింతకాయల బాబూరావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఇటుకుల గుంట గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ సమావేశం మాగంటి చింతారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ గ్రామంలో కుక్కల బారి నుంచి ప్రజలు, పశువులను కాపాడటానికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కుక్కల దాడిలో వేలాది రూపాయల విలువైన పాడి పశువులు మృతి చెందుతున్నాయన్నారు. తక్షణమే అధికారులు స్పందించి నష్టపరిహారానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, కోళ్ల ఫారాల నుంచి వస్తున్న ఈగలు ఆహార పదార్థాలపై వాలడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. ఈ సమస్యలను అధికారులు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలు పూరి శ్రీనివాస్, మాగంటి వెంకటరమణ, మల్లిపూడి సీతామహాలక్ష్మి, కోలపల్లి లక్ష్మి, పాలుపూరి సత్యవతి, పాలుపూరి వెంకట నాగమణి పాల్గొన్నారు.

జోరుగా సార్వా సాగు పనులు

అత్తిలి: మండలంలో సార్వాసాగు పనులు చేపట్టడానికి రైతాంగం సన్నద్ధమయ్యారు. కాలువలకు నీరు సరఫరా విడుదల చేయడంతో నారుమళ్లు వేసే పనులలో రైతులు నిమగ్నమయ్యారు. సార్వాసాగుకు అనుకూలమైన వరివిత్తనాలు, నారుమళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ వివరించారు.

విత్తనశుద్ధి

కిలో విత్తనానికి మూడు గ్రాముల కార్బెండజిమ్ 50 శాతం మందును కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. దంప నారుమళ్ళకయితే లీటర్ నీటికి ఒక గ్రాము కార్బెండజిమ్ 50 శాతం మందును కలిపి, ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి , 24 గంటలు మండెకట్టి మొలకెత్తిన విత్తనాన్ని దంప నారుమడిలో చల్లుకోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు మందు నీరు సరిపోతుంది. కార్బెండజిమ్ 25 శాతం, మాంకోజెబ్ 50 శాతం మిశ్రమ శిలీంద్రనాశనిని వాడితే 2 గ్రాములు కిలో విత్తనానికి, లీటరు నీటికి వంతున వాడాలి.

వరి విత్తనాల్లో నిద్రావస్థను తొలగించటం

కోత కోసిన వెంటనే విత్తనాలను వాడుకోవాలంటే వరి గింజల్లోని నిద్రావస్థను తొలిగించి అధిక మొలకశాతం రాబట్టడానికి, లీటరు నీటికి తక్కువ నిద్రావస్థ వున్న విత్తనాలకైతే 6.3 మి.లీ లేదా విజేత లాంటి ఎక్కువ నిద్రావస్థ ఉన్న విత్తనాలకైతే 10 మి.లీ గాఢ నత్రికామ్లం కలిపి ఆ ద్రావణంలో 24 గంటలు నానబెట్టి మరో 24 గంటల పాటు మండెకట్టాలి.



అత్తిలి మండలం గుమ్మంపాడులో నారుమడిని సిద్ధం చేస్తున్న రైతులు



అత్తిలి మండలం కె సముద్రపుగట్టులో నారుమడి కోసం దమ్ము చేస్తున్న దృశ్యం

విత్తన మోతాదు (ఎకరానికి): నాటే పద్ధతికి :20–25 కిలోలు, వెదజల్లుట (మెట్ట భూముల్లో): 24–30 కిలోలు, వెదజల్లుట (గోదావరి జిల్లాలో) : 12–15 కిలోలు, గొర్రుతో విత్తుట (వర్షదారపు వరి) : 25–30 కిలోలు, శ్రీ పద్ధతిలో 2 కిలోలు, యాంత్రిక వరి సాగు విధానములో 12–15 కిలోలు అవసరమవుతుంది.

సార్వావరి రకాలు

ఎంటీయూ 1318, ఎంటీయూ 7029, ఎంటీయూ 1061, పీఎల్ 1100 సంపద స్వర్ణ రకాలు సార్వాసాగుకు అనుకూలమైన విత్తనాలు.

ఆరోగ్యవంతమైన వరి నారు పెంచటానికి సూచనలు

నారుమడిని 10–12 రోజుల వ్యవధిలో 3 దఫాలు దమ్ముచేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయటానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేయాలి. 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని (విత్తనం చల్లేముందు 1 కిలో, మరో కిలో విత్తిన 10–15 రోజులకు), 1 కిలో భాస్వరం, 1 కిలో పొటాష్ నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో రబీ కాలంలో భాస్వరంను రెట్టింపు వేయాలి. శిలీంద్రనాశనితో శుద్ధి చేసి మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5కిలోల చొప్పున చల్లుకోవాలి. నారు, ఒక ఆకు పూర్తిగా పురివిచ్చుకునే వరకు ఆరుతడిగా నీరు ఇచ్చి తర్వాత పలుచగా నీరు నిల్వకట్టాలి. జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రా జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. చలి ఎక్కువగా ఉండే దాళ్వా వరి సాగులో జింకులోప లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు సెంటు నారుమడికి 160గ్రాముల చొప్పున వేయాలి లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేక క్లోరిపైరిఫాస్ 2.0 మి.లీ లీటర్ నీటికి కలిపి విత్తిన 10 రోజులకు మరియు 17 రోజులకు పిచికారీ చేయాలి లేదా నారు తీయటానికి 7 రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రా కార్బోఫ్యూరాన్ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరు ఉంచివేయాలి. మండె కట్టిన తర్వాత ముక్కు పగిలిన విత్తనాలను నారుమడిలో సమానముగా పలుచటి నీటి పొర ఉంచి విత్తుకోవాలి.

రోడ్డు నిర్మించండి మహా ప్రభో..

పెనుగొండ: మండల పరిషత్‌లో తీర్మానమైనా, నిధులు మంజూరైనా ములపర్రు పెదగరరవులో రహదారి నిర్మాణం చేపట్టడం లేదని ములపర్రు టీడీపీ ఎంపీటీసీ రొక్కాల నాగలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పెనుగొండ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద) అధ్యక్షతన మండ పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల అనంతరం రహదారి నిర్మాణానికి ఎంపీటీపీ కోటాలో ప్రతిపాదనలు చేశారన్నారు. దీనికి నిధులు సైతం మంజూరు చేసి తీర్మానం ఆమోదించారన్నారు. అయితే, ఇప్పటి వరకూ రహదారి నిర్మాణం చేపట్టలేదన్నారు. ఈ విషయం ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దృష్టికి స్వయంగా తీసుకెళ్లానన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



దువ్వలో యోగా పోటీల్లో విజేతకు ప్రశంసాపత్రం ఇస్తున్న ఎంపీడీవో ధనరాజు, ఏవో కృష్ణచంద్రరావు



అమ్మా కల్యాణ మండపంలో యోగాసనాలు వేస్తున్న మున్సిపల్ కమీషనర్

తణుకు అర్బన్: నేటి ఒత్తిడితో కూడా జీవనశైలిలో ప్రతిఒక్కరూ యోగాభ్యాసనను దినచర్యగా పాటించాలని తణుకు ఎంపీపీ రుద్రా ధనరాజు అన్నారు. తణుకు మండలం దువ్వ గ్రామంలోని సంతమార్కెట్‌లో ఉన్న దుర్గమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యోగాసనాలు, ప్రాణాయామం నిత్యం అభ్యసించాలని సూచించారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన యోగా పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన వారికి ప్రశంసాపత్రాలు అందచేశారు. తణుకు మండల పరిషత్ కార్యాలయం ఏవో వనిమిశెట్టి కృష్ణచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన గ్రామస్థులు, యోగాభ్యాసకులు పాల్గొన్నారు. తణు కు మండలంలోని అత్తిలి, ఇరగవరం మండలాల్లో కూడా యోగాంధ్ర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో అనేక ప్రాంతాలలో యోగా దినోత్సవాలు జరిగాయి. సచివాలయాల పరిధిలో, వివిధ యోగా సెంటర్‌లు పరిధిలో, వివిధ శాఖల అధికారులు ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో, వివిధ పార్టీలు వారిచే యోగా కార్యక్రమాలు, యోగా సాధన, ప్రోటోకాల్ యోగ ఆసనాలు జరిగాయి. విద్యార్థులు, మహిళలు, పెద్దలు, వృద్ధులు ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే తాడేపల్లిగూడెంలో మండలంలోని తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడు తదితర మండలాల్లో అంతర్జాతీయ యోగాంధ్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆర్థిక సాయం అందజేత

భీమవరం: భీమవరం పట్టణానికి చెందిన జిమ్ ట్రైనర్ సయ్యద్ భాషా పుట్టినరోజు సందర్భంగా శనివారం దివ్యాంగులకు ఆర్థిక సాయం అందజేశారు. తాడేరు రోడ్‌లోని ఇందిరమ్మ కాలనీకి చెందిన 8 మంది దివ్యాంగులకు సహాయం అందించిన సందర్భంగా తోట భోగయ్య మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సమాజంలోని అభాగ్యులకు చేతనైనా సాయం అందజేయడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, పెన్నాడ శ్రీను, రాకేష్, బిక్కిన శ్రీనివాస్, గొట్టుముక్కల మహేష్ రాజు, దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలోని తిరుమల కళాశాలలో శనివారం హైపర్ టెన్షన్ డే మాస ఉత్సవాలలో భాగంగా విద్యార్థులకు హైపర్ టెన్షన్ పై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కె శ్రావ్య(ప్రథమ), జి మనస్విని(ద్వితీయ) పీఎస్ గణేష్(తృతీయ) బహుమతులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి గీతాబాయి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్‌సీడీ డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి, ఎపిడిమాలజిస్ట్ సుభాష్, తిరుమల కళాశాల డైరెక్టర్స్ సాయిరాజు, శ్రీనివాసవర్మ, సతీష్ బాబు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులు దూరం

భీమవరం (ప్రకాశంచౌక్): ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్యం ఉండవచ్చని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం భీమవరం కలెక్టరేట్ గ్రౌండ్ నందు నిర్వహించిన 11వ యోగా దినోత్సవం కార్యక్రమం అనంతరం ప్రతి నెల 3వ శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర, – స్వర్ణాంధ్రలో భాగంగా నిర్వహించే కార్యక్రమాన్ని ఈ వారం యోగా డే సందర్భంగా జిల్లా అటవీ శాఖ భీమవరం వారి ఆధ్వర్యంలో హరిత యోగా కార్యక్రమం చేపట్టి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ చేతుల మీదుగా మొక్కలను పంపిణీ చేశారు. యోగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులకు ప్రజలకు 9,632 మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా అటవీ శాఖ అధికారి డి.ఆశా కిరణ్, పరిపాలన అధికారి యం.భారతి, సీనియర్ అసిస్టెంట్ సి.హెచ్.విజయ కుమార్, బి.పోశమ్మ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ యస్.సురేష్ కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.రామ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మదన గోపాలస్వామి కల్యాణోత్సవం

ఆకివీడు: స్థానిక టెలిఫోన్ ఎక్సేంజ్ సమీపంలోని మదన గోపాలస్వామి ఆలయంలో స్వామి వారి వార్షిక కల్యాణోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రుక్మిణీ సత్యభామ సమేత స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం స్వామివార్ల కల్యాణంను అర్చకులు సుదర్శన శేషాచార్యులు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గడ్డే బంగారమాయె

- ఎండు గడ్డి ధరకు రెక్కలు
- పాడి రైతుల ఇక్కట్లు

నరసాపురం రూరల్: రోజురోజుకూ పెరుగుతున్న ఎండలు, వర్షా భావంతో కొంత కాలంగా గ్రామాల్లో పశుగ్రాసం కొరత ఏర్పడింది. దీనికి తోడు దాళ్వా సాగులో కోతలకు ఈ ప్రాంతంలో గత కొంత కాలంగా యంత్రాలను వినియోగించడంతో పశువులకు గడ్డి దొరకడం లేదు. యంత్రాలతో కోతల వలన గడ్డి చిన్న చిన్న ముక్కలుగా తయారవడంతో పశువులకు ఎండుగడ్డి కొరత ఏర్పడుతుంది. దీంతో మూగజీవుల పొట్ట నింపడం కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని సుమారు 50వేల వరకు పశువులు ఉన్నాయి. వీటిని పోషించేందుకు గతంలో రైతులకు గడ్డి సంవృద్ధిగానే దొరికేది. అయితే ప్రస్తుతం పంట పొలాలను లే అవుట్లుగా రూపు మారడంతో కూడా కొంత మేర సాగు విస్తీర్ణం తగ్గడంతో ఎండు గడ్డి పూర్తిస్థాయిలో కొరత కనపడుతుంది.



ట్రాక్టర్లతో తరలిస్తున్న గడ్డి

యంత్రాల వినియోగంతో ఎండుగడ్డి కొరత

ఎండుగడ్డి వినియోగంపై సరైన అవగాహన లేక వరికోత మిషన్లను వినియోగించడం ద్వారా కూలీ ఖర్చులు తగ్గడం, తక్కువ సమయంలో ధాన్యం ఒబ్బిడి కావడం వంటి వాటిపైనే దృష్టి సారించడంతో ఈ కొరత మరింత ఎక్కువైంది. దీంతో మూగజీవాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయని పెంపకం దారులు వాపోతున్నారు. వీటిని పోషించే ఆర్థిక స్తోమత లేక పలువురు పెంపకం దారులు అయినకాడికి విక్రయిస్తున్నారు. ఒక వైపు వ్యాధులు ప్రభలడం, మరో వైపు పశుగ్రాసం కొరత వెరశి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల పెంపకం దారులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు. గతంలో సార్వా పంటకాలంలో ఎకరం గడ్డి రూ.4 వేలకు విక్రయించేవారు. అయితే దీనిని ఒబ్బిడి చేసి ఇంటికి లేదా పశువుల శాలకు చేరవేసేందుకు అదనంగా మరో రెండువేల వరకు ఖర్చయ్యేది. ప్రస్తుతం గడ్డి కూడా ఓ వ్యాపారంగా మారడంతో ట్రాక్టర్ ట్రక్కు ఒక్కింటికి (సుమారు ఎకరంన్నర)గడ్డి కొనుగోలు చేసి పశువుల శాలకు చేరేసేందుకు రూ.15 వేల వరకు ఖర్చవుతుంది. కృష్ణాజిల్లా నుండీ కొనుగోలు చేస్తే ఇంటికి చేరే సరికి ట్రాక్టర్ గడ్డి రూ.21వేలు అవుతుందని పాడి రైతులు వాపోతున్నారు. ప్రధానంగా తీరప్రాంత గ్రామాల్లో వరి గడ్డి దొరక్క పోవడంతో చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ఈ గడ్డిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. మూడేళ్ల క్రితం వరకు ఎకరం ఎండుగడ్డి నాలుగు వేలు ఉండేదని, ప్రస్తుతం 15వేల వరకు ఖర్చవుతుందని రైతులు పేర్కొంటున్నారు. దీనికి తోడు పశుగ్రాసం, తవుడు, దూగర, ఉలవలు, రాగులు, తదితర దాణా వస్తువులు కూడా రేట్లు పెరగడంతో మరిన్ని ఇబ్బందులు పడుతున్నామని పాడి రైతులు వాపోతున్నారు.